క్లుప్తంగా

చెరుకు సుధాకర్‌ను కలిసిన చేవెళ్ల నాయకులు



చెరుకు సుధాకర్‌ను కలిసిన నాయకులు

చేవెళ్ల: టీపీసీసీ ఉపాధ్యక్షుడు చెరుకు సుధాకర్‌ను బుధవారం గాంధీభవన్‌లో చేవెళ్ల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయను కలిసిన వారిలో టీపీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, చేవెళ్ల మండలపార్టీ ఉపాధ్యక్షుడు పాండు యాదవ్, నాయకులు మాజీ సర్పంచ్ నర్సింలు, ప్రవీణ్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

గోవులను రక్షిద్దాం



గోమాతకు పూజ చేస్తున్న కిసాన్ సంఘ్ నాయకులు

కొందుర్గు: గోవులు రైతులకు దేవుడితో సమానమని, వాటిని కాపాడే బాధ్యత మనందరిపై ఉందని భారతీయ కిసాన్ సంఘ్ మండలాధ్యక్షుడు చంద్రమౌళి అన్నారు. భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని ఉమా మహేశ్వరస్వామి దేవాలయం గోమాత పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం పశువులను అక్రమంగా రవాణా చేస్తున్నారని, పశువులను రక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కిసాన్ సంఘ్ నాయకులు చంద్రయ్య, లింగం, ప్రభులింగం, సుధాకర్, లక్ష్మయ్య, పూజారి భరత్ పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు

తహసీల్దార్‌కు మెదక్‌పల్లి గ్రామస్తుల ఫిర్యాదు

తలకొండపల్లి: అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మెదక్‌పల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. బుధవారం తలకొండపల్లి తహసీల్దార్‌కు కృష్ణకు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని మెదక్‌పల్లి గ్రామంలోని 123 సర్వే నంబర్ భూమిలో కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరిపి రాత్రివేళల్లో లారీల్లో రవాణా చేస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. కొంతమంది బడా నాయకుల మద్దతుతో ఈ తవ్వకాలు జరుపుతున్నారని ఆరోపించారు. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా మట్టి తవ్వకాలు ఆపాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వారికి హామీ ఇచ్చారు.

నేటి నుంచి వార్షికోత్సవాలు

ఇబ్రహీంపట్నం రూరల్: శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వార్షికోత్సవ వేడుకలు ఇబ్రహీంపట్నం మండలం కప్పపహాడ్ గ్రామంలో ఈనెల 16వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న ఈ వేడుకల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నర్సరీల పరిశీలన

ఆమనగల్లు: మాడ్గుల మండలంలోని సర్వాయిపల్లి, గుడితండా, కొత్తగానితండాల్లో బుధవారం ఎంపీడీఓ రాఘవులు , అధికారులు, సిబ్బంది పర్యటించారు. ఆయా గ్రామాల్లోని వన నర్సరీలను వారు పరిశీలించారు. హరితహారం కార్యక్రమం వరకు మొక్కలను సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఉపాధి హామీ పథకం పనులు పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బది, ఈజీఎస్ సిబ్బది పాల్గొన్నారు.

ఆడపడుచులకు అండగా ఉంటాం

సర్పంచ్ గోదాదేవి

ఆమనగల్లు: మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామంలో వివాహం చేసుకోబోయే ఆడపడుచులకు పెళ్లికానుక అందించి అండగా ఉంటామని శెట్టిపల్లి సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి, టీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు ఎగిరిశెట్టి సత్యం అన్నారు. శెట్టిపల్లి గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైనప్పటి నుంచి ఎగిరిశెట్టి గోదాదేవి, సత్యం దంపతులు గ్రామంలో వివాహం చేసుకోబోయే అమ్మాయిలకు రూ.10116 లను పెళ్లి కానుకగా అందిస్తున్నారు. అందులో భాగంగా గ్రామానికి చెందిన ఈదమ్మ, మల్లయ్య దంపతుల కుమార్తె రాణి వివాహం సందర్భంగా బుధవారం ఎగిరిశెట్టి సత్యం రూ.10116 అందించారు. ఇప్పటివరకు 57 మంది అమ్మాయిల వివాహానికి పెళ్లి కానుక అందించామని చెప్పారు. సర్పంచ్ ఎన్నికల ముందు ప్రజలకు హామీ ఇచ్చిన విధంగా ప్రజలకు అండగా ఉంటామని సత్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకటయ్య, స్థానిక నాయకులు యాదయ్య, నర్సింహా, పర్వతాలు, మహేశ్, పరశురాములు, జంగయ్య, శివ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ కష్టాలు..



మొయినాబాద్‌లో రోడ్డుపక్కన ఖాళీ స్థలంలో వేసిన చెత్త

- మొయినాబాద్‌లో రోజుకు పది ట్రాక్టర్లకు పైగా చెత్త సేకరణ
- డంపింగ్ యార్డు లేక ఖాళీ స్థలంలోనే పారబోత
- అక్కడి నుంచి బైపాస్ రోడ్డు వెళ్తుండడంతో చెత్త ఎక్కడ వేయాలో అర్థం కాని పరిస్థితి

మొయినాబాద్: ఇళ్ల నుంచి సేకరించిన చెత్తనంతా కంపోస్టు ఎరువులుగా మార్చేందుకు ప్రభుత్వం ప్రతి గ్రామంలో డంపింగ్ యార్డులను నిర్మించింది. అందులో భాగంగా మొయినాబాద్ గ్రామ పంచాయతీ పరిధిలో నిర్మించిన డంపింగ్ యార్డు ఇతరుల ఆధీనంలోకి వెళ్లిపోగా గ్రామంలోని చెత్తనంతా ట్రాక్టర్ల ద్వారా ఖాళీ స్థలంలో వేశారు. ఇప్పుడు ఆ ప్రాంతంలో నుంచి బైపాస్ రోడ్డు నిర్మిస్తుండడంతో చెత్త ఎక్కడ వేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. మొయినాబాద్ గ్రామ పంచాయతీ పరిధిలో చెత్త సమస్య తీవ్రమయ్యింది. ఇళ్లలో నుంచి ప్రతి రోజు సేకరిస్తున్న చెత్త ఎక్కడ వేయాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. గతంలో నిర్మించిన డంపింగ్ యార్డు ఇతరుల పట్టాపొలంలో నిర్మించారని దాని చుట్టూ ప్రహరీ గోడ నిర్మించారు. ప్రస్తుతం డంపింగ్ యార్డు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుంది.

రోజుకు 10 ట్రాక్టర్ల చెత్త...

మొయినాబాద్ గ్రామ పంచాయతీలో రోజుకు పది ట్రాక్టర్ల చెత్త వెలువడుతోంది. మొయినాబాద్ మండల కేంద్రం కావడంతో ఇటీవలి కాలంలో కొత్త కాలనీలు విస్తరించాయి. దీంతో ఇళ్లలోని చెత్తతో పాటు మండల కేంద్రంలోని షాపులు, చికెన్‌సెంటర్లు, హోటళ్ల నుంచి వచ్చే వ్యర్థాలు మొత్తం రోజుకు 10 ట్రాక్టర్ల చెత్త వస్తుంది. సేకరించిన చెత్తనంతా సురంగల్ రోడ్డు పక్కన ఉన్న ఖాళీ స్థలంలో వేస్తున్నారు. ఇప్పుడు ఆ ప్రాంతం నుంచి బైపాస్ రోడ్డు వెళ్తుంది. ఆ ఖాళీ స్థలమంతా బైపాస్ రోడ్డుకు వెళ్తుండంతో అక్కడ చెత్త వేయలేని పరిస్థితి నెలకొంది. కొత్తగా డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడానికి స్థలం కేటాయించాలని పంచాయతీ పాలకవర్గ సభ్యులు రెవెన్యూ అధికారులను ఎన్నిసార్లు వేడుకున్నా ఫలితం లేకుండా పోయింది.

పరాధీనంలో పాత డంపింగ్ యార్డు...

నాలుగేళ్ల క్రితం మొయినాబాద్‌లో డంపింగ్ యార్డును నిర్మించారు. ఆ సమయంలో ప్రభుత్వ స్థలంలోనే నిర్మించామని భావించారు. కానీ ఇటీవల ఓ ప్రైవేటు వ్యక్తి తన పట్టాభూమిని సర్వే చేయించగా డంపింగ్ యార్డు పట్టాభూమిలో ఉందని తేలడంతో డంపింగ్ యార్డు చుట్టూ ప్రహరీ గోడ నిర్మించారు. దీంతో చెత్తనంతా పక్కన ఉన్న ఖాళీ స్థలంలో వేస్తున్నారు.

స్థలం కేటాయించాలని కోరాం..



గతంలో నిర్మించిన డంపింగ్ యార్డు ప్రైవేటు స్థలంలోకి రావడంతో వాళ్లు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం డంపింగ్ యార్డు లేక ఇబ్బంది అవుతుంది. డంపింగ్ యార్డుకోసం స్థలం కేటాయించాలని తహసీల్దార్‌కు విన్నవించాం. స్థలం కేటాయిస్తే చెత్త సమస్య తీరుతుంది.

– కరిమాబీషేక్‌మహబూబ్, సర్పంచ్, మొయినాబాద్

స్థలాన్ని పరిశీలించాం



మొయినాబాద్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటు కోసం స్థలం కేటాయించాలని పంచాయతీ పాలకవర్గం సభ్యులు కోరారు. సురంగల్ రెవెన్యూలోని ప్రభుత్వ భూమిని పరిశీలించి పై అధికారులకు నివేదించాం. జిల్లా కలెక్టర్ నుంచి అనుమతి రావాల్సి ఉంది.

– అశోక్‌కుమార్, తహసీల్దార్, మొయినాబాద్

కబ్జా భూమి స్వాధీనం

సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్ డిమాండ్



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు భాస్కర్

షాద్‌నగర్: కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని అధికారులు తిరిగి స్వాధీనం చేసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగళ్ళ భాస్కర్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామ శివారులో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి వెంచర్ చేసిన స్థలాన్ని బుధవారం సీపీఎం నాయకులు గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ గోపాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. కిషన్‌నగర్ గ్రామ శివారులో ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేసి ప్లాట్లుగా మలిచి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని ఆరోపించారు. కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. అధికారులు వెంటనే స్పందించి ఆక్రమణకు గురైన భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని, లేని పక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అదే విధంగా గ్రామస్తుల సహకారంతో నిరుపేదలతో కలిసి ఇళ్ల స్థలాలను తామే కేటాయిస్తామని చెప్పారు. అక్రమ వెంచర్ వేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజు, బీస సాయిబాబ, శ్రీనునాయక్, ఈశ్వర్‌నాయక్, చంద్రమౌళి, కుర్మయ్య, రాజశేఖర్, రాజు, శంకరమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కన్సర్న్ ఇండియా ఫౌండేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్, షాబాద్ ఎంపీడీఓ అనురాధ



ఎంపీడీఓ అనురాధకు బహుమతి అందజేస్తున్న అర్జున్

షాబాద్: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినప్పుడే దేశం బాగుపడుతుందని కన్సర్న్ ఇండియా ఫౌండేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్, ఎంపీడీఓ అనురాధ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని నాన్‌సింధార్‌ఖాన్‌పేట్ గ్రామంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఇన్ కమ్యూనిటీస్ సహకారంతో కన్సర్న్ ఇండియా ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మహిళ దినోత్సవం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు బహుమతులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో స్వశక్తిగా రాణించాలన్నారు. కుటుంబాన్ని సమర్థవంతంగా నడిపిస్తున్న మహిళలు సామాజిక రంగాల్లో తమ ప్రతిభను కనబర్చాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు మరింత చైతన్యవంతం కావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కన్సర్న్ ఇండియా ఫౌండేషన్ ఫీల్డ్ ఆఫీసర్ మల్లేష్, సర్పంచ్ లింగం, హైతాబాద్ ఎంపీటీసీ జయమ్మ, తదితరులున్నారు.

ప్రసూతుల సంఖ్య పెంచాలి

డిప్యూటీ డీఎంహెచ్ఓ జయలక్ష్మి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జయలక్ష్మి

షాద్‌నగర్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసూతి సంఖ్య పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. బుధవారం పట్టణంలోని డిప్యూటీ డీఎంహెచ్ఓ కార్యాలయం ఆవరణలో డివిజన్ పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, హెల్త్ సూపర్ వైజర్లు, ఏఎన్ఎంలు, డీఈఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జయలక్ష్మి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసూతి చేయించుకుంటే ప్రభుత్వం అందించే ప్రయోజనాల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రసూతి అయిన వెంటనే కేసీఆర్ కిట్టు అందజేయాలన్నారు. గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది గర్భిణుల వివరాలను సేకరించి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని చెప్పారు. అలాగే, వారికి క్రమం తప్పకుండా వైద్యులతో పరీక్షలు చేయించి, ఐరన్ మాత్రలను పంపిణీ చేయాలన్నారు. అదే విధంగా చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలను ఇప్పించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేందుకు తగిన విధంగా కృషి చేయాలని సూచించారు. విధి నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే నిరుపేదలకు మెరుగైన చికిత్సలు అందించాలని చెప్పారు. సమావేశంలో హెల్త్ సూపర్ వైజర్లు శ్రీనివాసులు, డీఈఓ ఝాన్సీ, పీహెచ్‌సీ వైద్యులు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎంపీ రంజిత్‌రెడ్డి సతీమణి సీతారెడ్డి



ప్యాడ్స్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, సీత తదితరులు

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ఎందులో కూడా తక్కువ కాదని బాగా చదివి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఎదగాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి సతీమణి సీత అన్నారు. బుధవారం చేవెళ్లలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి చదివే విద్యార్థులకు ఆర్ఆర్ ఫౌండేషన్ సహకారంతో ఎగ్జామ్ ప్యాడ్స్‌ను ఎమ్మెల్యే కాలెయాదయ్య, సీతారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు బాగా చదువుకొని పాఠశాలలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. చదువు లేకుండా భవిష్యత్తు ఉండదని గుర్తించాలని తెలిపారు. 10వ తరగతి విద్యార్థులకు చిన్న సహాయంగా ఇది అందిస్తూ వారికి ఆల్‌దిబెస్ట్ చెబుతున్నట్లు ఎంపీ రంజిత్ రెడ్డి భార్య సీత అన్నారు. విద్యార్థులకు ఎప్పుడు ఎంపీ రంజిత్‌రెడ్డి అండగా ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల 10వ తరగతి విద్యార్థులకు ఈ ఎగ్జామ్ ప్యాడ్స్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. అంతేకుండా 10వ తరగతిలో మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు 10వేల నగదు బహుమతులను అందించనున్నట్లు ఆమె ప్రకటించారు. పార్లమెంట్ పరిధిలోని అన్ని మండలాలకు ఇది వర్తిస్తుందని చెప్పారు. విద్యార్థులు బాగా కష్టపడి చదువుకోవాలని చెప్పారు. ఎలాంటి పరిస్థితుల్లో కూడా చదువును నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. ఈ సందర్భంగా మల్కాపూర్ ఎంపీటీసీ, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బి. రవీందర్‌రెడ్డి విద్యార్థులకు తనవంతుగా ఎగ్జామ్‌ప్యాడ్‌లతో పాటు పెన్నులను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ మాలతి, సర్పంచ్ బండారి శైలజ, వైస్ ఎంపీపీ శివప్రసాద్, ప్రిన్సిపాల్స్ టేనేవాతి, శ్వేతారెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు శేరి శివారెడ్డి, నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు వనం లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు మల్లారెడ్డి, సత్యనారాయణచారి, నరహరిరెడ్డి, నరేందర్‌చారి, రాంచంద్రయ్య, నాయకులు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమపై చర్యలకు డిమాండ్

సర్పంచ్ పాండురంగారెడ్డి



పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు, తదితరులు

నందిగామ: నిబంధనలకు పాతరేస్తూ.. అమాయక ప్రజల పొట్టకొట్టుతున్న పోకర్ణ పరిశ్రమపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని మేకగూడ సర్పంచ్ పాండురంగారెడ్డి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మేకగూడ శివారులోని పోకర్ణ గ్రానైట్స్ పరిశ్రమ ఎదుట మెదక్ జిల్లా తుప్రాన్ మండలం ఘన్‌పూర్ గ్రామానికి చెందిన రైతులు వెంకటేష్ గౌడ్, భారతమ్మ దంపతులు బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళన కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ పాండురంగారెడ్డి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా బాధిత రైతులు వెంకటేష్‌గౌడ్, భారతమ్మలు మాట్లాడుతూ.. మల్కాజిగిరి, మేడ్చల్ జిల్లా, మేడ్చల్ మండలం రాజబొల్లారం గ్రామ శివారులో సర్వే నం.355లో 3 ఎకరాల భూమిని 2021లో కొనుగోలు చేశామని, ఆ భూమిని తమకు విక్రయించాలని అక్కడ పరిశ్రమను స్థాపించిన పోకర్ణ యజమాన్యం తీవ్ర ఒత్తిడి తెచ్చిందని, అయినా తాము విక్రయించక పోవడంతో మా భూమిలోకి వెళ్లకుండా అక్రమంగా ప్రహరీ నిర్మించి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై ఎంతో మంది ఉన్నతాధికారులను కలిసిన విన్నవించిన ఎలాంటి ఫలితం లేదని వాపోయారు. సర్పంచ్ పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. రైతులను, గ్రామస్తులను నమ్మించి మోసం చేస్తున్న పోకర్ణ పరిశ్రమ బాధితులందరిని ఏకతాటిపైకి తెస్తున్నామన్నారు. బాధిత రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో వికాలంగుల సంఘం రాష్ట్ర నాయకుడు జడ్సన్ పలువురు రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

హనీఫ్ మృతికి సంతాపం

చేవెళ్ల: మండలంలోని మొండివాగు గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు హనీఫ్ పరిగి మండలం రంగాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. ఈ సందర్భంగా బుధవారం మొండివాగు గ్రామానికి వెళ్లిన సీపీఐ పార్టీ నాయకులు ఆయన మృతికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ.. హనీఫ్ మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. సీపీఐ పార్టీలో గత 15ఏళ్లుగా క్రియాశీలకంగా, గ్రామ కార్యదర్శిగా పనిచేసినట్లు తెలిపారు. ఆయన మృతి బాధాకరమన్నారు. ఆయన కుటుంబసభ్యులను ఓదారుస్తూ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ. 10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదానికి కారణమైన లారీ యాజమాని రూ.15లక్షల పరిహారం చెల్లించాలన్నారు. పరామర్శించిన వారిలో నాయకులు కె.రామస్వామి, ఊరేళ్ల సర్పంచ్ జహంగీర్, సత్తిరెడ్డి, మల్లేశ్, శివయ్య, తదితరులు ఉన్నారు.

మొదటిరోజు ప్రశాంతం



మొయినాబాద్‌రూరల్: ఎన్‌టీఆర్ కళాశాల ఎదుట పరీక్షకు హాజరైన విద్యార్థినులు

- ఎలాంటి సంఘటనలకు తావు లేకుండా ఇంటర్ పరీక్షల నిర్వహణ
- అరగంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు
- అన్ని మౌలిక సదుపాయాలు కల్పించిన అధికారులు

చేవెళ్ల: ఇంటర్మీడియేట్ వార్షిక పరీక్షలు మొదటిరోజు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. చేవెళ్ల మండల కేంద్రంలో ఇంటర్ పరీక్ష కేంద్రాలు నాలుగు కళాశాలలో ఏర్పాటు చేశారు. నాలుగు పరీక్ష కేంద్రాల్లో మొదటిరోజున 1233 మంది విద్యార్థులకు గాను 1171 మంది పరీక్షలు రాయగా 62 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని చేవెళ్ల కస్టోడియన్ శేషాద్రి తెలిపారు. అన్ని కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు తెలిపారు.

విద్యార్థుల హడావిడి

పరీక్షా కేంద్రాల వద్ద మొదటి రోజు విద్యార్థుల హడావిడి కనిపించింది.విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. కేంద్రాల వద్ద హాల్‌టికెట్ల నంబర్లు చూసుకొని ముందుగానే లోపలకి వెళ్లారు.

మొయినాబాద్ రూరల్‌లో..

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని గండిపేట కుటీరం ఎన్‌టీఆర్ ట్రస్ట్ హిమాయత్‌నగర్ గ్రామ పంచాయతీ సమీపంలో గల ఎన్‌టీఆర్ కుటీరంలో ఇంటర్మీడియట్ పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. ఎన్‌టీఆర్ ట్రస్ట్ విద్యా సంస్థల్లో మండలంలోని ఆయా ఇంటర్ కళాశాలలకు చెందిన 576 మంది విద్యార్థులకు గాను 574 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఇద్దరు గైర్హాజరయ్యారని కళాశాల కరస్పాండెంట్ తెలిపారు.

శంకర్‌పల్లిలో..

శంకర్‌పల్లి: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శంకర్‌పల్లిలో ప్రశాంతంగా జరిగాయి. మున్సిపల్ పరిధిలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, చైతన్య జూనియర్ కళాశాల, వివేకానంద జూనియర్ కళాశాల, వాసవీ ఒకేషనల్ కళాశాలల్లో పరీక్షలు నిర్వహించారు. మండలంలోని ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 911మంది విద్యార్థులకు గాను 43మంది గైర్హాజరయ్యారు. 868మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. కాగా, ఒకేషనల్‌లో మొత్తం 183మంది విద్యార్థులకూ 31మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 152మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని కస్టోడియన్ వసంత పేర్కొన్నారు.



హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



కేశంపేట: పరీక్ష రాసేందుకు వేచిఉన్న విద్యార్థులు

కేశంపేటలో..

కేశంపేట: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రంలో 207 మంది విద్యార్థులకు గాను 198 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు.

షాద్‌నగర్‌లో...

షాద్‌నగర్: పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించారు. షాద్‌నగర్‌లో ఏడు పరీక్షల్లో కేంద్రాల్లో మొత్తం 2687 మంది విద్యార్థులకు గాను 2504 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 83 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 489 మంది విద్యార్థుల కు గాను 460మంది, మొగిలిగిద్ద ప్రభుత్వ కళాశా లలో 224మంది విద్యార్థులకు గాను 216 మంది, ప్రతిభ కళాశాలలో 354 మందికి గాను 326మంది, విశ్వభారతీ కళాశాలలో 489 మందికి గాను 466 మంది, విజ్ఞాన్ కళాశాలలో 572మందికి గాను 524 మంది, విజేత జూనియర్ కళాశాలలో 347 మందికి గాను 319 మంది, శ్రీసాయి ఒకేషనల్ కళాశాలలో 212మందికి గాను 193 మంది విద్యార్థులు హాజరైనట్లు కస్టోడియన్ అధికారులు శ్రీకాంత్, కిష్టప్పలు తెలిపారు.

కాన్షీరామ్‌కు ఘన నివాళి



కొందుర్గు: కాన్షీరామ్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న బీఎస్పీ నాయకులు



జయంతి వేడుకల్లో పాల్గొన్న బీఎస్పీ నాయకులు

కొందుర్గు: మండల కేంద్రంలో బుధవారం బీఎస్పీ నాయకులు కాన్షీరామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఎస్పీ షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు ప్రశాంత్ మాట్లాడుతూ.. దేశంలో బహుజనుల రాజ్యం రావాలని కాన్షిరాం కళలు కనేవారని, అయన కళను నిజం చేసేందుకు అందరు కలిసిరావాలని కోరారు. బీఎస్పీ అధికారం చేపడితేనే బహుజనులకు న్యాయం జరుగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఏకమై బహుజన రాజ్యం తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో బీఎస్పీ మండలాధ్యక్షుడు దుర్గని శ్రీనివాసు, నాయకులు తొండపల్లి దర్శన్, శ్రీనివాసు, ఉదయ్‌కృష్ణ, నర్సింలు, అమరేందర్, రవి, శివ పాల్గొన్నారు.

బీఎస్పీ జిల్లా కోశాధికారి రాంప్రసాద్‌గౌడ్

షాద్‌నగర్‌రూరల్: బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన మహనీయుడు, బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరాం అడుగుజాడల్లో ప్రతిఒక్కరు నడవాలని బీఎస్పీ జిల్లా కోశాధికారి రాంప్రసాద్‌గౌడ్ అన్నారు. బీఎస్పీ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు పొట్టనర్సింలు ఆధ్వర్యంలో బుధవారం కాన్షీరాం 89వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో కాన్షీరాం చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం రాంప్రసాద్‌గౌడ్ మాట్లాడుతూ.. బహుజనులను రాజ్యాధికారం దిశగా నడిపించిన మహానుభావుడు కాన్షీరాం అని అన్నారు. బలహీన వర్గాల ప్రజలు రాజ్యాధికారాన్ని సాధించుకున్నప్పుడే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారని చెప్పారు. 'ఓట్లు మావి..సీట్లు మీవా' అనే నినాదంతో అగ్రకుల రాజ్యాధికారాన్ని ప్రశ్నించిన రాజకీయ వేత్త కాన్షీరాం అని కొనియాడారు. బాబా సాహెబ్ అంబేద్కర్ రాజకీయ సిద్ధాంతాన్ని ఆచరణలోకి తీసుకువచ్చేందుకు కాన్షీరాం ఎంతో కృషి చేశారని అన్నారు. అంబేద్కర్ రాజకీయ సిద్ధాంతం స్ఫూర్తితో బహుజన సమాజాన్ని నిర్మించాలనే లక్ష్యంతో కుటుంబాన్ని, ఉద్యోగాన్ని వదిలి ప్రజల కోసం ముందుకు కదిలిన ధీశాలి కాన్షీరాం అని వివరించారు. అలాంటి నాయకుడి ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ అసెంబ్లీ ఇన్‌చార్జి నర్సింలు, మహిళా అధ్యక్షురాలు సుగుణ, నాయకులు పరమేష్, మోజెస్, ఆశీర్వాదం, చంద్రయ్య, జగన్, జలంధర్‌గౌడ్, సుదర్శన్, మల్లేష్, శ్రీనివాస్, చందు, చంద్రయ్య, వెంకట్‌రెడ్డి, పాషా తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట: మాన్యశ్రీ కాన్షీరామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు లింగం అన్నారు. ఆయన జయంతి వేడుకలను మండల కేంద్రంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు హరికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లింగం మాట్లాడుతూ.. బలహీన వర్గాలకు రాజ్యాధికారం దక్కాలని నిరంతరం కాన్షీరాం ఆకాంక్షించారని అన్నారు. అంబేద్కర్ రాజకీయ సిద్ధాంతాన్ని ఆచరణలోకి తీసుకువచ్చిన వ్యక్తి కాన్షీరామ్ అని కొనియాడారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాములు, భీమయ్య, చంద్రయ్య, మల్లేష్ పాల్గొన్నారు.